నమస్తే తెలంగాణ

# వరంగల్

5 | వరంగల్, మంగళవారం 1 అక్టోబర్ 2024 | WARANGAL




దాస్యం వినయ్‌భాస్కర్‌ను అరెస్టు చేస్తున్న ఏసీపీ దేవేందర్



నయీంనగర్ బ్రిడ్జి వద్ద దాస్యం, బీఆర్ఎస్ శ్రేణులపై దాడికి యత్నిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

# కాంగ్రెస్ గూండాల దౌర్జన్యం

## నాలా పరిశీలనకు వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులపై దాడికి యత్నం

- ఇరు వర్గాల మధ్య తోపులాట.. నయీంనగర్‌లో ఉద్రిక్తత
- గాయపడిన బీఆర్ఎస్ మహిళా కార్యకర్త తస్లీమా
- దాస్యంను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల



హనుమకొండలోని నయీంనగర్ నాలాను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, శ్రేణులు

నయీంనగర్, సెప్టెంబర్ 30 : పశ్చిమ ఎమ్మెల్యే నాయిని సవాల్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, శ్రేణులతో కలిసి నయీంనగర్ నాలా పరిశీలనకు రాగా కాంగ్రెస్ గూండాలు దౌర్జన్యం చేశారు. బీఆర్ఎస్ కార్యాలయం నుంచి కార్యకర్తలతో బైక్ ర్యాలీగా వచ్చిన దాస్యం శాంతియుతంగా నయీంనగర్ నగర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా జై నాయిని, రాజేందర్‌రెడ్డికి అడ్డెవడంటూ నినాదాలతో బీఆర్ఎస్ శ్రేణుల వైపు దూసుకురావడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో అక్కడ కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడే ఉన్న పోలీసులు దాస్యం వినయ్ భాస్కర్‌తో పాటు, పార్టీ కార్యకర్తలపై జులుం ప్రదర్శించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో బీఆర్ఎస్ మహిళా కార్యకర్త తస్లీమాకు గాయాలయ్యాయి. వెంటనే బీఆర్ఎస్ శ్రేణులు ఆమెను ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తల దౌర్జన్యాన్ని నిరసిస్తూ దాస్యం అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆయనను అరెస్ట్ చేసి పోలీస్ వాహనంలో ఎక్కించుకొని పెట్రోల్ పంపు, అంబేద్కర్ సర్కిల్, అదాలత్ సెంటర్, సుబేదారి, అక్కడి నుంచి హనుమకొండ చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాల్లో తిప్పి బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం హనుమకొండ పోలీస్ స్టేషన్ తరలించి కేసు నమోదు చేశారు. ఆ తదుపరి సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. దాస్యం వెంట కార్పొరేటర్లు సోదా కిరణ్, ఇమ్మడి లోహిత రాజు, సంకు నర్సింగ్, చెన్నం మధు, బొంగు అశోక్, రంజిత్ రావు, కూడా మాజీ చైర్మన్లు సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, నాయకులు పబ్బోజు శ్రీకాంతాచారి, బండి రజిని, పులి రజినీకాంత్, రాకేశ్, ప్రశాంత్, వీరు, కల్యాణ్ తదితరులున్నారు. కాగా, నాలా వద్దకు చేరుకున్న మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ 2022లో ఈ పనులకు సంబంధించి టెండర్ పూర్తయ్యింది వాస్తవమేనన్నారు. పనులు ఆలస్యం కావడంతో ప్రస్తుత ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్ని శాఖలను కలుపుకొని పనులు పూర్తి చేయించారన్నారు.



బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో బ్రిడ్జి నిర్మాణం కోసం సాంక్షన్ పత్రాన్ని చూపిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్



దాస్యంను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసు వాహనం ముందు నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు



గాయపడిన మహిళా కార్యకర్త తస్లీమా

## అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే

### బీఆర్ఎస్ నాయకులపై దాడిని ఖండిస్తున్నా : రాకేశ్‌రెడ్డి



హనుమకొండ, సెప్టెంబర్ 30 : హనుమకొండలోని నయీంనగర్ బ్రిడ్జిని పరిశీలించేందుకు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో వెళ్లిన శ్రేణులపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి తెలిపారు. ప్రశాంతంగా ఉన్న హనుమకొండలో స్వయంగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డినే అత్యుత్సాహం ప్రదర్శిస్తూ శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఒక ప్రజాప్రతినిధి దిగజారి గాజులు, చీరలతో రోడ్ల మీద నిలబడి సవాళ్లు చేయడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అశాంతి, విధ్వంసం, అరాచకం సృష్టించేందుకే ప్రయత్నిస్తున్నదన్నారు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 2 నెలలు ఎన్నికల కోడ్‌కే పోయిందని, అప్పుడే ప్రపోజల్, టెండర్లు, నిధుల మంజూరు పనులు పూర్తి అయ్యాయా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో మాత్రమే ఎమ్మెల్యే తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాడని, ఒకసారి నిధులు మంజూరయ్యాక ఆ స్థానంలో ఎవరున్నా పని అవుతుందన్నారు. ఒక బ్రిడ్జి పూర్తయితేనే రోడ్డెక్కి ఇంత హంగామా చేస్తే రేపు ఇంకేదైనా ఘనకార్యం చేస్తే ప్రజలు, ప్రతిపక్ష నాయకుల ఇళ్లలోకి దూరి దాడులు చేసేలా ఉన్నారని రాకేశ్‌రెడ్డి ఆరోపించారు.



హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

# నిధులు బీఆర్ఎస్‌వి.. ప్రచారం కాంగ్రెస్‌ది..

- రూ. 500 కోట్లకు పైగా విడుదల చేసింది కేటీఆర్..
- పనులు పూర్తి చేశామని చెప్పకునేది మాత్రం నాయిని
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, సెప్టెంబర్ 30 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి నిధులు విడుదల చేస్తే పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తమ పేరు చెప్పుకోవడం సిగ్గు చేటని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నయీంనగర్ నాలా, సమ్మయ్యనగర్ వరద కాలువ నిర్మాణానికి నిధుల కేటాయింపు, జరిగిన పనులు తదితర అంశాలను సోమవారం ఆయన విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 ఆగస్టులో వరదలు వచ్చిన సమయంలో మంత్రి కేటీఆర్‌ను ఇక్కడకు తీసుకొచ్చి రూ. 25కోట్లు, 2021లో శాశ్వత పరిష్కారం కోసం రూ. 70 కోట్లు, 2022లో నాలాల ఆధునీకరణ, వరద నివారణ చర్యల్లో భాగంగా రూ. 250 కోట్లు, ఇతర నిధుల నుంచి రూ. 200 కోట్లు, మొత్తంగా రూ. 500 కోట్లకుపైగా నిధులు తెచ్చిన విషయం ప్రజలు మరువలేదన్నారు. అనాడే కేయూ వందఫీట్ల రోడ్డు అండర్ డ్రైనేజీ, నాలా మీద బ్రిడ్జి, ఇతర పనుల కోసం టెండర్లు పిలిచామన్నారు. ఒక్కొక్కటిగా పనులు పూర్తిచేయాలనే ఉద్దేశంతో మొదట నాలాకు రిటెయినింగ్ వాల్ నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. వందఫీట్ల రోడ్డు వద్ద అండర్ డ్రైనేజీ పూర్తయ్యిందని, అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. తమిళనాడులో బీసీల రాజ్యాధికారం ఎలా ఉందనే విషయాన్ని పరిశీలించేందుకు తాను చెన్నై వెళ్లానని, మరి రాజేందర్ రెడ్డి ఢిల్లీ, అమెరికా, ఆస్ట్రేలియా ఎందుకు వెళ్లాడో చెప్పాలన్నారు. తాను అధికారంలో ఉన్నప్పుడు ఏడాది కాలంలోనే రూ. 1,000 కోట్ల నిధులు తీసుకొచ్చానని దాస్యం తెలిపారు. నాయిని గెలిచి తొమ్మిది నెలలైందని, ఇప్పటి వరకు తీసుకొచ్చిన నిధులెన్ని? చేసిన అభివృద్ధి ఏమిటి? అన్నది ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. దమ్మంటే పెద్దమ్మగడ్డ శ్మశాన వాటికి గోడ కూల్చిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించి, దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'చిల్లర మల్లర రాజకీయాలు, గూండాయిజం, బెదిరింపుల కు భయపడే ప్రసక్తి లేదు.. నీవు గెలిచినపుడు అభినందించిన.. నగర అభివృద్ధికి సహకరిస్తానని చెప్పిన.. అన్ని వర్గాలున్న పశ్చిమ నియోజకవర్గంలో అలజడులు సృష్టించొద్దు' అంటూ హెచ్చరించారు. వయసుకు కూడా విలువ ఇవ్వకుండా తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పోరాడిన పెద్ద మనిషిని ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే ఊరుకొనేది లేదని దాస్యం స్పష్టం చేశారు. పదవి ఉన్నా.. లేకున్నా ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి, కాంగ్రెస్ పార్టీ హామీలపై పోరాడుతూనే ఉంటానన్నారు.

**ప్రజాపాలన కాదు.. ప్రతీకార పాలన**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని... ప్రతీకార పాలన అని దాస్యం ధ్వజమెత్తారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ ప్రతిపక్ష నాయకులపై దాడి జరగలేదని, ఇదే మొదటిదన్నారు. శిలాఫలకాలు పగులగొట్టడం, అనుచరులను రెచ్చగొట్టడం, బెదిరింపులకు పాల్పడడ, అధికారం ఉందని పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం, కేసులు పెట్టడం తగదని రాజేందర్‌రెడ్డికి హితవు పలికారు. ఉద్యమ సమయంలో మహబూబాబాద్‌లో రాళ్ల దాడి జరుగుతుంటే నీవు ఎక్కడ దాక్కున్న విషయం ప్రజలకు తెలుసన్నారు. రాజేందర్‌రెడ్డి తన శైలి, సంస్కృతిని మార్చుకోవాలని హితవు పలికారు. తెలంగాణ భవన్‌పై జరిగిన దాడి సరికాదని, తమపై కాంగ్రెస్ దాడి, పోలీసుల అక్రమ అరెస్ట్ హేయమైనవన్నారు. తమపైన దాడి చేసిన వారిని వదిలిపెట్టి, తమమీదే కేసులు పెట్టి పోలీసులు నగరం మొత్తం తిప్పారన్నారు. మేయర్ గుండు సుధారాణి చేసిన ఆరోపణలను ఆమె విజ్ఞతకే వదిలివేస్తున్నానని తెలిపారు. సమావేశంలో మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్ రాజు, మర్రి యాదవ రెడ్డి, నాగుర్ల వెంకన్న, నియోజక వర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# అర్హతలున్నా రుణమాఫీ చేయరా?





మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, రుణమాఫీపై ప్రశ్నిస్తున్న రైతు

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని నిలదీసిన రైతులు
- ప్రభుత్వం కొర్రీలు మాని రుణం మాఫీ చేయాలని డిమాండ్
- ఊకల్ సొసైటీలో 1,221 మందికి మాఫీ కాలే
- ఆధార్, రేషన్ లేని వారికి దసరాలోపు మాఫీ : ఎమ్మెల్యే

గీసుగొండ, సెప్టెంబర్ 30 : అన్ని అర్హతలున్నా రైతులకు ఎందుకు రుణమాఫీ చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారీగా రైతుల రుణాలు మాఫీ చేయటానికి సిద్ధంగా ఉందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని రైతులు నిలదీశారు. గీసుగొండ మండలం ఊకల్ రైతు సహకార సంఘం 40వ మహాజన సభ సోమవారం చైర్మన్ బొమ్మాల రమేశ్ అధ్యక్షతన ఏర్పాటుచేయగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న రైతులు, రైతు సంఘం నాయకులు మోర్తాల చందర్‌రావు, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, గోనె కుమారస్వామి, తదితరులు ఎమ్మెల్యే దృష్టికి రుణమాఫీ అంశాలపై ప్రశ్నించారు. ఆధార్‌కార్డు నంబర్లు తప్పులని, రేషన్‌కార్డులు లేవని అనేక కొర్రీలను చూపుతూ రైతులకు రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులు చేసిన అధికారులపై చర్యలు తీసుకొని షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం రేషన్ కార్డులే ఇవ్వకుండా రేషన్ కార్డు ఉన్న వారికే రుణమాఫీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో సమావేశంలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఎమ్మెల్యే స్పందించి రైతులు సహకరించాలని, అర్హులందరికీ రుణమాఫీ చేస్తామని బడ్జెట్ లేక రుణమాఫీ ఆలస్యం అవుతున్నదని చెప్పారు. ఆధార్ కార్డులు, రేషన్‌కార్డులు లేని వారికి దసరా లోపు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదన్నారు. రూ.2 లక్షల రుణం ఉన్న రైతులకు ఐదు విడుతల్లో రుణమాఫీ అవుతుందని తెలిపారు. దసరాలోపు రైతు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఊకల్ సహకార సంఘంలో 2,739 మంది రైతులుండగా అందులో 1,518 మంది రూ.18.56 కోట్ల రుణమాఫీ వచ్చిందని ఇంకా 1,221 మందికి రూ.18 కోట్ల డబ్బులను ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ డబ్బులు వచ్చేలా చూస్తానని తెలిపారు. రుణమాఫీ రాని రైతుల కోసం సొసైటీలో నోడల్ అధికారిని నియమించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కమర్షియల్ బ్యాంకులు 7శాతం వడ్డీతో వ్యవసాయ రుణాలు ఇస్తుంటే సొసైటీలో 12శాతం వసూలు చేస్తున్నారని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వడ్డీ రేట్లు తగ్గించేలా చూస్తానని ఎమ్మెల్యే చెప్పారు. సమావేశం ప్రారంభంలో వార్షిక బడ్జెట్ ఆదాయ, వ్యయాలు వివరిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే తనకు సమయం లేదని మాట్లాడి వెళ్లిపోవడంతో రైతులు కూడా వెళ్లిపోయారు. రైతుల కోసం జరిగే సమావేశంలో పాల్గొనేందుకు కూడా ఎమ్మెల్యేకు సమయం లేదా అని పలువురు రైతులు చర్చించుకోవడం కనిపించింది.

## కొత్త నియామకాలు లేకపోవడం వల్లే..

- లీగల్ మెట్రాలజీలో ఇన్‌చార్జి అధికారులతో విధులు
- పలుచోట్ల దాడులు.. 28 కేసులు నమోదు

నమస్తే ఎఫెక్ట్

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 30 : వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్‌లో కొత్త నియామకాలు లేకపోవడం వల్లే పక్క జిల్లాలోని అధికారులను నియమించి విధులు నిర్వర్తిస్తున్న విషయం వాస్తవమేనని లీగల్ మెట్రాలజీ రీజినల్ డిప్యూటీ కంట్రోలర్ కె.సిద్దార్థకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న 'నమస్తే తెలంగాణ'లో 'ఆ శాఖలో అందరూ ఇన్‌చార్జీలే' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. రెండు చోట్ల ఉన్న అధికారులకు సమ పని దినాలు విభజించి, అత్యవసర పనులను ముందుగా చేయిస్తున్నట్లు తెలిపారు. విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు 2024 వరకు ముద్ర రుసుము, రాజీ రుసుము వసూలు చేయడంతో పాటు 84 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే నమస్తే తెలంగాణలో వార్త ప్రచురితమైన తర్వాత డిపార్ట్‌మెంట్ ద్వారా పలుచోట్ల దాడులు నిర్వహించి, 28 కేసులు నమోదు చేయడంతో పాటు రూ.53వేల అపరాధ రుసుము విధించినట్లు ఆయన వివరించారు.

## చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

- వృద్ధుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పోక్సో కేసు నమోదు
- ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో ఘటన

ఖానాపురం, సెప్టెంబర్ 30 : బాలికపై(06) వృద్ధుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నారి తల్లిదండ్రులు కూరగాయల దుకాణం నడు పుతుండగా, రాములు(65) మద్యం సేవిస్తూ చిన్నచిన్న పనులు చేస్తూ అప్పుడప్పుడూ వారికి సహాయ పడుతుంటాడు. ఈ క్రమంలో బాలికతో చనువు ఏర్పడింది. ఆదివారం మద్యం సేవించిన రాములు చిన్నారికి మాయ మాటలు చెప్పి బిస్కెట్ ప్యాకెట్ కొనిచ్చి సమీ పంలోని పాఠశాల వెనుక వైపు చెట్ల పొదల్లోకి తీసుకెళ్లాడు. బాలిక వెళ్లి చాలా సేపు కావడంతో వాళ్ల అమ్మమ్మ చుట్టుపక్కల వెతుకుతుండగా, మీ పాపను రాములు తీసుకెళ్లాడని ఇంటి పక్క నున్న ఆమె చెప్పింది. దీంతో వారిద్దరూ బాలికను వెతకడానికి పాఠశాలలోకి వెళ్లారు. అక్కడ చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడేందుకు యత్నిస్తుండగా వాళ్లు గట్టిగా కేకలు వేశారు. దీంతో వృద్ధుడు అక్కడి నుంచి పారిపోతుండగా గమనించిన చుట్టుపక్కల వాళ్లు పట్టుకుని చితకబాది పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం దుగ్గొండి రూరల్ సీఐ సాయి వెంకటరమణ, ఎస్సై రఘుపతి పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వృద్ధుడిపై పోక్సో కేసుతో పాటు బీఎన్ఎస్ ప్రకారం మరో రెండు సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు తెలిసింది.

## నేటి నుంచి కొత్త మద్దతు ధరలు

కాశీబుగ్గ, సెప్టెంబర్ 30 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో అక్టోబర్ 1వ తేదీ నుంచి కొత్త మద్దతు ధరలు అమలు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త మద్దతు ధరలు దేశవ్యాప్తంగా అన్ని మార్కెట్లలో అక్టోబర్ నుంచి సెప్టెంబర్ చివరి వరకు అమలవుతాయి.

| వ్యవసాయ ఉత్పత్తులు | గత ఏడాది ధర (క్వింటాకు రూ.లో) | కొత్త ధర (క్వింటాకు రూ.లో) |
|---|---|---|
| వరి కామన్ | 2183 | 2300 |
| వరి గ్రేడ్ ఏ | 2203 | 2320 |
| పచ్చజొన్నలు | 3180 | 3371 |
| జొన్నలు | 3225 | 3416 |
| సజ్జలు | 2500 | 2625 |
| రాగులు | 3846 | 4290 |
| మక్కజొన్న | 2090 | 2225 |
| కందులు | 7000 | 7550 |
| పెసర్లు | 8550 | 8682 |
| మినుములు | 6950 | 7400 |
| వేరుశనగ | 6377 | 6783 |
| పొద్దు తిరుగుడు | 6760 | 7280 |
| సోయాబీన్ | 4600 | 4892 |
| నువ్వులు | 8635 | 9267 |
| పత్తి(మీడియం) | 6620 | 7121 |
| పత్తి(పొడవు రకం) | 7020 | 7521 |

## బడులు కడితే మేధావులు.. గుడులు కడితే భిక్షగాళ్లు తయారైతరు

**వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు వివాదాస్పద వ్యాఖ్యలు**



కేజీబీవీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు, సెప్టెంబర్ 30 : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవల మాల ఉద్యోగ సంఘం సమావేశంలో తమ సామాజిక వర్గానికి చెందిన వారిపైన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని మాదిగల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ వివాదానికి తెర పడక ముందే నాగరాజు సోమవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో హెల్త్ కార్డు పంపిణీ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 'నేను అంబేద్కర్ చెప్పిన మాటలను నమ్ముతా.. ఆయన చెప్పిన విధంగా గుడుల కన్నా బడులు మేలు.. బడులు నిర్మాణం చేస్తే మేధావులు తయారవుతారు. గుడులు నిర్మాణం చేస్తే భిక్షగాళ్లు తయారు అవుతారు' అని మరో వివాదానికి తెరతీశాడు. ఈ వ్యాఖ్యలు చేసిన కొద్దిసేపటికే ఆయన ఐనవోలు మల్లికార్జునస్వామిని దర్శించుకోవడం గమనార్హం.

## టైర్ పేలి ప్రైవేట్ బస్సు బోల్తా

- ఇద్దరికి తీవ్ర.. మరో 23 మందికి స్వల్ప గాయాలు...
- బెంగళూరు నుంచి వరంగల్ వస్తుండగా ఘటన



యశ్వంతాపూర్ గ్రామం వద్ద టైర్ పేలి అదుపుతప్పిన ప్రైవేట్ బస్సు

జనగామ రూరల్, సెప్టెంబర్ 30 : వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రైవేట్ బస్సు టైర్ పేలి బోల్తా పడిన ఘటన జనగామ జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం జనగామ మండలంలోని యశ్వంతాపూర్ వద్ద బెంగళూరు నుంచి 25 మంది ప్రయాణికులతో వరంగల్ వస్తున్న ప్రైవేట్ బస్సు టైరు పేలింది. దీంతో బస్సు అదుపుతప్పి బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రంగా, మరో 23 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని బస్సులోని ప్రయాణికులను బయటకు తీసి తీవ్రంగా గాయపడిన ఇద్దరిని జనగామ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా జంగేడుకు చెందిన పోచయ్యకు చేయి విరగడంతో ఇక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం వరంగల్ పంపించారు. మిగతా వారు తమ ప్రదేశాలకు వెళ్లిపోయారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

## అది ఆఫీసా? ఇల్లా?

- కార్యాలయంలోని గదిలోనే అటెండర్ నివాసం
- ఇష్టారాజ్యంగా వాజేడు ఎంపీడీవో సిబ్బంది తీరు
- సమయపాలన పాటించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు

వాజేడు, సెప్టెంబర్ 30 : వాజేడు ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల సమయపాలన పాటించకపోవడంతో నిత్యం వివిధ సమస్యలు చెప్పుకొనేందుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం ఉదయం 10గంటలు దాటినా కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్ సహా ఎవరూ రాకపోవడంతో ఆ గదిలో అటెండర్ సాయిబాబు టేబుల్‌పై దర్జాగా కాళ్లుపైకి పెట్టుకొని నిద్రిస్తుండడం అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తున్నది. అంతేగాక హాల్ సమీపంలోని ఒక గదిని నివాస గృహంగా మార్చుకున్నాడు. కార్యాలయం ఆవరణ, మీటింగ్ హాల్ పరిసరాలు అధ్వానంగా మారగా శుభ్రం చేసేందుకు వచ్చిన గ్రామ పంచాయతీ సిబ్బందిపైనా అటెండర్ దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడుతున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు ప్రతిరోజూ సమయానికి రాకపోయినా పట్టించుకునే వారు లేరని ఆరోపణలున్నాయి. ఎవరూ రాకపోయినా ఫ్యాన్లు, లైట్లు వేయడం విద్యుత్‌ను వృథా చేస్తున్నారని, గతంలో ఈ ఆఫీస్ విద్యుత్ బకాయి ఉండడంతో విద్యుత్‌శాఖ కరెంట్ సరఫరా నిలిపివేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయమై ఎంపీడీవో విజయను 'నమస్తే' ఫోన్లో వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఎంపీడీవో సమావేశ మందిరంలో ఖాళీగా కుర్చీలు, వెలుగుతున్న విద్యుత్ లైట్లు, తిరుగుతున్న ఫ్యాన్



బల్లపై కాళ్లు పెట్టి పడుకున్న అటెండర్ సాయిబాబు